

వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని వికారాబాద్ కలెక్టర్‌కు అందజేస్తున్న చెన్నయ్య

## భాషా, సాహిత్య రంగాలను ప్రోత్సహిస్తాం

### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 5 : వికారాబాద్ జిల్లాలో భాషా, సాహిత్య రంగాలను ప్రోత్సహిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఇటీవల ప్రచురించిన వికారాబాద్ జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య సోమవారం కలెక్టర్‌కు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో అత్యంత క్రియాశీలంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటివరకు పూర్వపు రంగారెడ్డి జిల్లాలో భాగంగా ఉన్న వికారాబాద్ జిల్లా ఇప్పుడు అన్ని రంగాల్లో తన ప్రతిభను చాటుకుంటున్నదని వివరించారు. జిల్లా అభ్యున్నతిపై తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రచురించిన గ్రంథాన్ని అందరికీ అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్క రూ తమ జిల్లా గొప్పదనాన్ని తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య మాట్లాడుతూ నిజాం కాలంలో 80 ఏండ్ల కిందట వెలసిన సారస్వత పరిషత్తు తెలుగు భాషా పరిరక్షణకు అవిశ్రాంతం గా కృషి చేస్తున్నదన్నారు. తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాషా సాహిత్యాలు, కళలు తదితర అంశాలపై సమగ్ర గ్రంథాలను వెలువరిస్తున్నదని, ఇప్పటికీ 16 జిల్లాలు పూర్తయ్యాయని వివరించారు. ఈ గ్రంథాన్ని రూపొందించడంలో పరిషత్తుకు తోడ్పడిన అవధాని అంజయ్య కలెక్టర్ నారాయణరెడ్డిపై ఓ పద్యాన్ని ఆలపించారు. కార్యక్రమంలో పలువురు కవులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 : శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనం 334, 335లలో ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ పేరుపై ఉన్న 5 ఎకరాల 12 గుంటల భూమిని ఎం.వరప్రసాద్ అనే వ్యక్తి తప్పుడు పత్రాలు సృష్టించి నకిలీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. బాధితుడు ఓ దినపత్రికను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయాన్ని సోమవారం ప్రచురించగా రూ. 60కోట్ల విలువ చేసే భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశాడనే ఆరోపణలు రావడంతో శంకర్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

## ప్రజావాణికి 125 ఫిర్యాదులు

### వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఫిబ్రవరి 5 : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి 125 ఫిర్యాదులు వచ్చాయని వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అమిత్‌నారాయణ్, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు షురూ

### ఈ నెల 12 వరకు నిర్వహణ



బొట్లవానితండా ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక పరీక్ష రాస్తున్న బాలికలు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 5 : పదోతరగతిలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ ఈ ఏడాది కొత్తగా ప్రత్యేక పరీక్షలను నిర్వహిస్తున్నది. ఈ పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా.. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వార్షిక పరీక్షల నాటికి విద్యార్థులు పరీక్షలపై పట్టు సాధించి మంచి మార్కులు సాధించాలన్న ఉద్దేశంతోనే అధికారులు వీటిని నిర్వహిస్తున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించి మధ్యాహ్నం 1.45 నుంచి సాయంత్రం 5.30 వరకు మరుసటి రోజు నిర్వహించే పరీక్షకు విద్యార్థులను చదివించి సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా వార్షిక పరీక్షలకు ముందు నిర్వహించే ప్రీ-ఫైనల్ పరీక్షలను ఈ నెల 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వీటికి విద్యార్థులను అన్ని విధాలుగా ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు.



షాబాద్ ఏఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భారతీయకిసాన్ సంఘ్ సభ్యులు

## విద్యుత్తు సరఫరాలో నాణ్యత పెంచాలి

### భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి

షాబాద్, ఫిబ్రవరి 5 : వ్యవసాయానికి ఇస్తున్న విద్యుత్తు సరఫరాలో నాణ్యత పెంచాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు యాదవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యుత్తు కార్యాలయం ఎదుట రైతుల విద్యుత్తు సమస్యను పరిష్కరించాలని కొద్దిసేపు ఆందోళన నిర్వహించి ఏఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్తులో నాణ్యత లోపించి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలోని కేశవగూడ, ఎర్రోనిగూడ తదితర గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో నాణ్యత లోపించి బోరు మోటర్లు కాలిపోతున్నాయన్నారు. సరఫరాకు సరిపడా డీటీఆర్‌లను పెంచాలన్నారు. కార్యక్రమంలో కేశవగూడ, సోలీపేట్, నాగరకుంట, షాబాద్ తదితర గ్రామాలకు చెందిన భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# రీ-టెండర్ ఎప్పుడో..

## శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఆదాయానికి గండి

- కొన్నేండ్లుగా తక్కువ అద్దె చెల్లిస్తున్న దుకాణదారులు
- 238 షాపులకు ఏడాదికి రూ.15 లక్షల వరకే ఆదాయం
- మళ్లీ టెండర్ వేస్తే రూ.2 కోట్లకు పైగా రానున్న రాబడి
- స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో టెండర్ ప్రక్రియకు జాప్యం
- రీ-టెండర్ వేసి అన్ని వర్గాలకు షాపులు కేటాయించాలంటున్న ప్రజలు




రైల్వేస్టేషన్ రోడ్డులోని మున్సిపల్ దుకాణాలు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 : శంకర్‌పల్లి మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండిపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడంలేదు. శంకర్‌పల్లి గ్రామ పంచాయతీగా ఉన్నప్పటి నుంచే అతి తక్కువ అద్దెను చెల్లిస్తూ కొందరు దుకాణదారులు కొన్నేండ్లుగా వ్యాపారాలను నిర్వహిస్తున్నారు. మున్సిపల్ పరిధిలో 238 దుకాణాలుండగా ఒక్కో దుకాణానికి కనిష్ఠంగా రూ. 500, గరిష్ఠంగా రూ.1,500 అద్దె మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం దుకాణ సముదాయానికి రీ-టెండర్ నిర్వహించి అన్ని వర్గాల వారికి కేటాయించాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి అధికారులు కూడా ఒక రకంగా అడ్డుపడుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

ఐదు గ్రామాలను కలిపి 2018లో శంకర్‌పల్లిని మున్సిపాలిటీగా ఏర్పాటుచేశారు. మున్సిపాలిటీ ఏర్పడిన నాటి నుంచే దుకాణ సముదాయానికి రీ-టెండర్ వేయాలని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే కలెక్టర్ ఆదేశాలను అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, అధికారుల అండదండలో తెలియదుకానీ దుకాణాల రీ- టెండర్ ప్రక్రియ జరుగడంలేదు. ప్రస్తుతం మున్సిపల్‌కు దుకాణాలవల్ల దాదాపుగా రూ.15 లక్షల వరకు ఆదాయం వస్తున్నది. మళ్లీ టెండర్ నిర్వహిస్తే రూ.2 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నది. పక్కనే ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఒక్కో దుకాణానికి కనిష్ఠంగా రూ.15 వేలు గరిష్ఠంగా రూ. 30వేల వరకు ప్రతినెలా అద్దె వసూలవుతున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి 238 మున్సిపల్ దుకాణాలకు మళ్లీ టెండర్లు పిలవాలని శంకర్‌పల్లి మున్సిపల్, మండల ప్రజలు కోరుతున్నారు.



చేవెళ్ల రోడ్డులోని షాపులు

### షాపులను అన్ని వర్గాలకు కేటాయించాలి



దుకాణ సముదాయంలోని షాపులను అన్ని వర్గాల ప్రజలకు కేటాయించాలి. అధికారులు స్పందించి వెంటనే రీ-టెండర్ వేయాలి. మళ్లీ టెండర్లు పిలువకపోవడంతో మున్సిపాలిటీకి కోట్లాది రూపాయల ఆదాయం గండిపడుతున్నది. మున్సిపల్‌లో జరిగే ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ ఈ అంశంపై ప్రతిసారి లేవనెత్తినా ఇప్పటికీ పరిష్కారం లభించలేదు.

-రాములు, కౌన్సిలర్

### ఉన్నతాధికారులు స్పందించాలి



మున్సిపాలిటీ పరిధిలోని దుకాణాలకు వెంటనే రీ-టెండర్ ప్రక్రియను మొదలుపెట్టాలి. ఐదు గ్రామాలను కలిపి శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. ఏండ్ల తరబడిగా తక్కువ అద్దె చెల్లిస్తూ పలువురు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. షాపులకు రీ-టెండర్ నిర్వహిస్తే నిరుద్యోగ యువత వ్యాపారాలు చేసుకుని స్థిరపడే అవకాశాలుంటాయి. అధికారులు ప్రత్యేక చొరవ చూపి 238 దుకాణాలకు మళ్లీ టెండర్లు పిలవాలి.

-నర్సింహులు (మాజీ సర్పంచ్)
రామంతాపూర్ వార్డు

### అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియను చేపడుతాం



కొన్నేండ్లుగా మున్సిపాలిటీ షాపులకు తక్కువ అద్దె వస్తున్న మాట వాస్తవమే. రీ-టెండర్ వేసేందుకు చాలాసార్లు ప్రయత్నించాం. కానీ దుకాణదారులు రాజకీయ నాయకులు, అధికారులతో ఫోన్లు చేయించి నిలిపివేయించారు. గతంలో కలెక్టర్ కూడా రీ-టెండర్ వేయాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితిని ఉన్నతాధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రీ-టెండర్ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

-జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమిషనర్

## అసైన్డ్ భూములు అమ్మినా.. కొన్నా చర్యలు తప్పవు

### మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్, ఫిబ్రవరి 5 : పేదలు సాగు చేసుకుని జీవించేందుకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను అమ్మినా.. కొన్నా చట్టపరంగా చర్యలు తప్పవని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కొందరు విక్రయిస్తున్నట్లు తెలుస్తున్నదని.. వాటిని అమ్మడం, కొనడం చేయొద్దన్నారు. వాటిని సాగు చేసుకునేందుకు మాత్రమే రైతులకు హక్కులు ఉంటాయన్నారు. మండలం హైదరాబాద్ నగరానికి అనుకున్న ఉన్నందున భవిష్యత్తులో ఒకవేళ ప్రభుత్వం అసైన్డ్ భూములను అమ్ముకునేందుకు అవకాశమిస్తే పట్టాదారులకు లాభం జరుగుతుందని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఆ భూములను అమ్మినా.. కొన్నా చట్టప్రకారం ఇరువురిపై చర్యలు తీసుకోవడంతోపాటు పీవోటీ చట్టం కింద ఆ భూములను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటుందన్నారు.

### ప్రవేశాలకు దరఖాస్తుల గడువు తేదీ పొడిగింపు

వికారాబాద్, ఫిబ్రవరి 5 : వికారాబాద్ జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరానికి మైనార్టీస్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సుధారాణి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు 5, 6, 7, 8 తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో ప్రవేశాలకు ఈ నెల 15వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

### వేసవి ప్రారంభంలో ముదురుతున్న ఎండలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఎండల మంట మొదలైంది. ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రం వైపునకు వీస్తున్న గాలుల ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి దాటి నమోదవుతున్నాయి. అయితే వేసవి ప్రారంభంలోనే ఎండలు ముదురుతుండడంతో మార్చి, ఏప్రిల్ నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం జంకుతున్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 డిగ్రీలు పెరిగి 34డిగ్రీలు..కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2.8 డిగ్రీలు పెరిగి 20.8 డిగ్రీలు, గాలిలో తేమ 38% నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

## ప్రథమ శ్రేణిలో పాస్ కావాలి

- వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి
- బండవెల్కిచర్లలోని జడ్పీహెచ్‌ఎస్ పరిశీలన



విద్యార్థినితో మాట్లాడుతున్న వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి

కులకచర్ల, ఫిబ్రవరి 5: పదోతరగతి ఫలితాల్లో బండవెల్కిచర్ల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జిల్లాలోనే మొద టి స్థానంలో నిలవాలని వికారాబాద్ జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోని ఉన్నత పాఠశాలను పరిశీలించి.. విద్యార్థులు టెన్త్ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమవుతారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి పాఠశాలను జిల్లాలోనే మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఇందుకోసం ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు పలు సమస్యలను ఆమెకు వివరించారు. పాఠశాలలో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బం ది పడుతున్నారని, ఆంగ్లబోధకులు కావాలని, ట్యాంకును నిర్మించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, వైస్ ఎంపీపీ రాజశేఖర్, శ్రీనివాస్, మొగులయ్య, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 8న తుది ఓటరు జాబితా విడుదల

- జాబితాలో లోటుపాట్లు ఉంటే సవరించాలి
- కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు పంపాలి
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక



కలెక్టరేట్‌లో ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : తుది ఓటరు జాబితా ఈనెల 8న విడుదల కానున్న నేపథ్యంలో జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి లోటుపాట్లను సవరించుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో స్పెషల్ రివిజన్ సమ్మరి-2024కు సంబంధించిన తుది ఓటరు జాబితాపై ఆయన సంబంధిత ఆర్డీవోలు, తహసీల్దార్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు ప్రక్రియపై మరోసారి సమగ్రంగా పరిశీలన జరిపించి తుది ఓటరు జాబితాను పూర్తి చేయాలని, డూప్లికేట్ ఓట్లు లేకుండా చూడాలన్నారు. ఫామ్-8 ద్వారా మార్పులు, చేర్పుల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ఇంకనూ ఎక్కడైనా కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ముఖ్యంగా 1,450 పైచిలుకు ఓటర్లు ఉన్న చోటే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించాలన్నారు.

### ఉద్యోగుల సమగ్ర డేటాను పొందుపర్చాలి

పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ఉద్యోగుల సమగ్ర డేటాను పొందుపర్చాలని కలెక్టర్ శశాంక సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు ఉద్యోగుల డేటా సేకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, పీఎస్‌యూఎస్, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల విధుల నిర్వహణకు ఉద్యోగుల డేటాను అందించేటప్పుడు శ్రద్ధ వహించి పూర్తి సమాచారం పొందుపరిచాలన్నారు. 45 కాలమ్స్‌లో హెచ్‌వోడీలు/నోడల్ అధికారులు ఉద్యోగి ఎపిక్ నెంబర్, హెచ్‌వోడీలు/నోడల్ అధికారులు పార్ట్‌నంబర్, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలు తప్పనిసరిగా పొందుపర్చాలన్నారు. ఉద్యోగి ఉంటున్న ఇంటినంబరు, వీధి/కాలనీ పేరుతో ఏరియా పేరు, పిన్‌కోడ్ నంబర్‌తో సహా పూర్తి నివాస చిరునామాను అందించాలన్నారు. ప్రస్తుతం ఉద్యోగి పని చేసే నియోజకవర్గం, ఉద్యోగి స్థానిక జిల్లా, మండలం, నియోజక వర్గానికి మాత్రమే సంబంధించిన వివరాలను(సర్వీస్ రిజిస్టర్ ప్రకారం) అందించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అధికారులు, బ్యాంకింగ్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌పై ఉదారంగా వ్యవహరించాలి

బ్యాంకర్లు పంటల ఆర్థిక స్థాయి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. వివిధ పంటలకు ఆర్థిక స్థాయి నిర్ణయం(స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లాల బ్యాంకర్లు, ఎల్డీఎంలు, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువగా ఇస్తే రైతులకు మే లు జరుగుతుందన్నారు. బ్యాంకులు ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మొత్తాన్ని పెంచితే ఎకరాకు వచ్చే రుణ సహాయం సైతం పెరుగుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సాయం నిర్ణయంపై ఉదారంగా ఉండాలని, ఈ విషయాన్ని రాష్ట్ర స్థాయికి ప్రతిపాదించాలని సూచించారు. ముఖ్యంగా అన్ని రకాల పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ సానుకూలంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీసీబీ సీఈవో భాస్కరా సుబ్రహ్మ ణ్యం, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి అంజిలప్ప, మత్స్య, వ్యవసాయ శాఖల అధికారిణులు సుకీర్తి, గీతారెడ్డి, ఉమ్మడి జిల్లాల సెరికల్చర్, ఉద్యాన శాఖల అధికారులు, ఎల్డీఎంలు, నాబార్డ్ అధికారి పాల్గొన్నారు.

## అక్రమ నివాసులను ఖాళీ చేయించాలి

### కలెక్టర్‌కు జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే ఇండ్ల లబ్ధిదారుల వినతి

రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : గత ప్రభుత్వాల హయాంలో నిర్మించిన జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే ఇండ్లల్లో అక్రమంగా ఉంటున్న వారిని ఖాళీ చేయించి లబ్ధిదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు బాధితులు సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. పెద్ద ఎత్తున బాధితులు కలెక్టరేట్‌కు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 2006లో అప్పటి ప్రభుత్వం కర్మన్‌ఘాట్‌లో అర్హులైన నిరుపేదలకు జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే పథకంలో ఇండ్లను నిర్మించిందని.. అందుకు లబ్ధిదారుడి వాటాగా 512 మంది రూ.80,250 చొప్పున మొత్తం రూ.4,10,88,000 డీడీ రూపంలో చెల్లించినట్లు తెలిపారు. లబ్ధిదారులకు ఇండ్లను అప్పగించడంలో కొంత జాప్యం జరుగగా.. ఇదే సందర్భంలో కొందరు అక్రమంగా చొరబడి ఇండ్లల్లో నివాసం ఉంటున్నారని పేర్కొన్నారు. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శ్రీనివాస్‌రాథోడ్, రాజ్‌కుమార్, మోహన్, రాజు, మోతీలాల్, పద్మ, సీత, ఆస్మాబేగం, మాధవి తదితరులు ఉన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జేఎన్ఎన్‌యూఆర్ఎం, వాంబే ఇండ్ల లబ్ధిదారుల నిరసన



## ప్రభుత్వ భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆగపల్లిలో ప్రభు త్వ భూముల కబ్జాపై ఆగపల్లికి చెందిన దూసరి లక్ష్మయ్య సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేశారు. ఆగపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 191లో 2.22 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నదని, ఓ వెంచర్ నిర్వాహకులు సదరు భూమిని ఆక్రమించి రో డ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో సర్వేనం. 187 లో 33.10గుంటల ప్రభుత్వ భూమి ఉండగా.. అక్కడ సుమారు నాలుగు ఎకరాల వరకు ఆక్రమణకు గురైందని వివరించారు. వెంచర్ నిర్వాహకులు పార్కింగ్ కోసం ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారన్నారు. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ స్థలంలో బోర్డును ఏర్పాటు చేసినా వెంచర్ నిర్వాహకులు దానిని తొలగించారని, వారికి కొందరూ అధికారులు సహకరిస్తున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. రూ. వందల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాజేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.